క్లుప్తంగా

వృద్ధులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్మన్ రమేష్‌బాబు

దెందులూరు : మేధినరావుపాలెంలోని బాదంపూడి చారిటుబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ బాదంపూడి రమేష్‌బాబు మాట్లాడుతూ గత 12 ఏళ్ల నుంచి ఏటా తమ సంస్థ ద్వారా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. బెంగుళూరులోని స్వచ్ఛత సంస్థ, ఏలూరు జిల్లాలోని బాదంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రమేష్‌బాబును సేవారత్న అవార్డుకు ఎంపిక చేశారు. కరోనా సమయంలో ఆయన చేసిన సేవలు, ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు రమేష్‌బాబు తెలిపారు.

సీడీపీఓగా కృష్ణ కుమారికి పదోన్నతి



జాయినింగ్ రిపోర్ట్ అందచేస్తున్న కృష్ణకుమారి

దెందులూరు : దెందులూరు ప్రభుత్వ బాల సదనం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎ.కృష్ణకుమారికి పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల ప్రాజెక్ట్ సీడీపీఓగా పదోన్నతి లభించింది. ఈమేరకు ఆమె జాయినింగ్ రిపోర్టును జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.సుజాతారాణికి అందజేశారు. బాలసదనం సూపరింటెండెంట్‌గా పని చేసినకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అందించిన సహాయసహకారాలు మరువలేనివని అన్నారు. ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న బేబీ సరోజినికి దెందులూరు ప్రభుత్వ బాలసదనం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ శుక్రవారం లిఖితపూర్వక ఆదేశాలను జారీ చేశారు.

మంచినీటి చెరువులో గేదెలు



కొవ్వలి మంచినీటి చెరువులో గేదెలను వదిలేసిన దృశ్యం

దెందులూరు : కొవ్వలి మంచినీటి చెరువులో (పార్క్‌వెనుక) గేదెలను వదలడంపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులకు ఈ మంచినీటి చెరువులోని నీటినే పంచాయతీ ట్యాప్‌ల ద్వారా అందజేస్తారు. వేలాదిమంది గ్రామస్తులకు ఇక్కడినుంచే సురక్షితమైన మంచినీరు అందజేస్తారు. దీంతో ఈ చెరువులో గేదెలను వదలడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి చెరువు చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేయాలని, గేదెలను వదిలిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎ.గోకవరంలో డ్రైడే



నిల్వనీరు కుండీలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి ప్రసాదు

ఉంగుటూరు: ఎ.గోకవరం గ్రామంలో జిల్లా మలేరియా అధికారి ప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ గ్రామంలో మలేరియా పోజిటివ్ కేసు నమోదైన నేపథ్యంలో హెల్త్ సిబ్బంది డ్రైడే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలను చైతన్యపరిచారు. చేబ్రోలు పీహెచ్‌సీ డాక్టర్ సుబ్బరాజు వర్మ, మలేరియా సబ్‌యూనిట్ అధికారి లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



పచ్చికూరగాయలతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గణపవరం : కేంద్ర ప్రభుత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక గ్యాస్ సిలిండర్ల ధర రెట్టింపు చేసిందని, క్రమంగా పేద మధ్యతరగతి ప్రజలను గ్యాస్‌కు దూరం చేస్తుందని సీపీఎం నాయకులు విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కేశవరం వంతెన కూడలిలో పచ్చి కూరగాయలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పట్నాల శ్రీనివాస్, బనవా నాయుడు, ఎర్రినాయుడు, అంజనేయులు, వి.నాగేశ్వరరావు, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులది గురుతర బాధ్యత



పిప్పరలో గృహసారథుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు



సమావేశంలో పాల్గొన్న గృహసారథులు, పార్టీ శ్రేణులు

గణపవరం : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి మద్దతు కూడగట్టి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చే గురుతర బాధ్యత గృహసారథులు, సచివాలయ కన్వీనర్లపై ఉందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పరలో పిప్పర, చిలకంపాడు, కాశిపాడు, వాకపల్లి, వీరేశ్వరపురం, వల్లూరు, ముగ్గుళ్ల, ఎ.గోపవరం, కోమట్లపాలెం గ్రామాలకు చెందిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమ నిర్వహణపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంత మంచి చేసినా ప్రజల్లోకి చెడుగా తీసుకెళ్తున్న పచ్చమీడియా ప్రచారాన్ని గృహ సారథులు తిప్పికొట్టాలని, ప్రజలకు వాస్తవాన్ని వివరించి, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించి, వారి మద్దతు కోరాలన్నారు. వచ్చే ఎన్నికలలో అధికారంలోకి రావడానికి టీడీపీ, దాని అనుకూల పార్టీలు, తోక మీడియా ఎన్నో కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నాయని, పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయడం వల్లనే 151 స్థానాలలో విజయం సాధించామని, వచ్చే ఎన్నికలలో 175 సీట్లు సాధించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్య సాధనకు మనమంతా శ్రమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థలు ప్రజలకు పరిపాలనను పూర్తి అందుబాటులోకి తెచ్చాయన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధులైతే, గృహ సారథులు పార్టీకి, ప్రజలకు మధ్య వారధులని అన్నారు. అందువల్ల గృహసారథులపై గురుతర బాధ్యత ఉందన్నారు. దేశంలో కులం, మతం, వర్గం, ప్రాంతం, పార్టీ తేడాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదేనని, అర్హత ఉండి పథకాలు అందనివారందరికీ రెండో విడతగా పథకాలు మంజూరు చేస్తున్న ఏకైక ప్రభుత్వం మనదేనన్నారు. ప్రతి గ్రామ సచివాలయానికి ముగ్గురు కన్వీనర్‌లు, వారికి ఒక మండల కన్వీనర్‌లను ఏర్పాటు చేశామన్నారు. మార్చి 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ గృహసారథులు ఇంటింటికి తిరిగి ఆ ఇంటికి ప్రభుత్వం అందించే పథకాలను వివరించడంతో పాటు, మా నమ్మకం నువే జగనన్న అనే కార్యక్రమాన్ని వివరించాలని దిశా నిర్దేశం చేశారు. గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి గల తేడాలను వివరించాలని అన్నారు. కార్యక్రమంలో గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మిబాబులు, పిప్పర సర్పంచ్ కాకరబేబీ, మండల ఉపాధ్యక్షురాలు నీతిపూడి వీరమ్మ, ఎంపీటీసీ ద్వారంపూడి విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దండు సూరిబాబు, వైఎస్సార్ టీఎఫ్ నాయకుడు కాకర శ్యాంసన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాలకు సంప్రోక్షణ



కైకరం కళింగ రామాలయం వద్ద విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు : కైకరం తూర్పు పేట రామాలయం వద్ద పంచలోహ విగ్రహాలకు శుక్రకవారం సంప్రోక్షణ నిర్వహించారు. రుత్వికలు అనిపెద్ది అచ్యుత రామయ్య, వారణాసి సత్యనారాయణ, శర్మ వేద మంత్రాలతో పంచామృత అభిషేకములు అష్టోత్తర శత నామావళి కుంకమపూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకమ పూజలు నిర్వహించారు. కంచరపు విజయదుర్గ, లక్ష్మీ వరప్రసాదు, యండా రామదాసు నాగమణి దంపతులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఉగాదిన శోభాయాత్ర

దెందులూరు : ఉగాది రోజున దెందులూరులో నవ దేవ దేవేరుల శోభాయాత్ర నిర్వహిస్తామని రామ దండు ప్రతినిధి సుగ్గిశెట్టి నూకరాజు తెలిపారు. హిందూ సంప్రదాయ ధర్మాన్ని అనుసరిస్తూ రామ దండు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి సంజీవిని పర్వత సహిత ఆంజనేయ అవతారంతో ఉన్న జెండాను పంపిణీ చేస్తామన్నారు. ఆరోజున గ్రామంలో 4 వేల జెండాలను ఇంటింటికి అందజేస్తామన్నారు. ఈమేరకు శుక్రవారం నాటికి జెండాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం



పెద్దింట్లమ్మను దర్శించుకుంటున్న కొఠారు రామచంద్రరావు

పెదపాడు : వీరమ్మకుంట గ్రామంలోని పెద్దింట్లమ్మ ఆలయంలో శుక్రవారం నూతన ఏక శిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠా, ఆలయ శిఖర పునః ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు పెద్దింట్లమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ కమిటీ ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆయన వెంట నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, ఎంపీటీసీ పూడి అప్పలస్వామి పాల్గొన్నారు. అనంతరం మాజీ మంత్రి మరడాన రంగారావు, వైఎస్సార్ సీపీ పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతిష్ఠా కార్యక్రమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారికి బలిహరణ నిర్వహించారు. అన్నసమారాధన చేశారు. ఆలయ ధర్మకర్త స్వర్గీయ దాసరి కోటేశ్వరరావు కుమారులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

పెదవేగి : జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారిణి ఆర్‌వీ నాగరాణి అన్నారు. శుక్రవారం జానంపేట గ్రామంలో 249-1/2 సర్వే నెంబర్‌లో ఇచ్చిన జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఇంటి నిర్మాణం చేసే వారికి 48 గంటలలలో స్వయం సహాయక సంఘం ద్వారా బేసిమెంట్ వేసుకునేందుకు రూ.35 వేల రుణంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వివిధ దశలలో రూ.లక్షా 80 వేలు మంజూరు చేస్తుందని తహసీల్దార్ నాగరాజు వివరించారు. ఆప్షన్ 3 ద్వారా ఇంటి నిర్మాణం చేసే వారికి కాంట్రాక్టర్ ద్వారా కట్టిస్తామన్నారు. రానున్న రెండు రోజుల్లో లేఅవుట్‌లోని ప్రతి ప్లాటుకు మంచినీటి పంపులను, విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ మాట్లాడుతూ లేఅవుట్‌లో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులు కూడా జరుగుతాయని, చుట్టూ కాంపౌండ్ వాల్ కూడా నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు చేరిన మహాసంగ్రామ పాదయాత్ర



భీమడోలు చేరుకున్న పాదయాత్రలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు నాగరాజు

భీమడోలు : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ శ్రీకాకుళంలో చేపట్టిన మాదిగల మహా సంగ్రామ పాదయాత్ర శుక్రవారం సాయంత్రం భీమడోలు చేరుకుంది. ఈ యాత్రకు ఉంగుటూరు నియోజకవర్గంలోని ఎంఆర్‌పీఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు భీమడులులోని బీఆర్ అంబేద్కర్, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చి మాట తప్పిన బీజేపీని గద్దె దించేవరకు పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల సమన్వయ కర్త బయ్యారపు రాజేశ్వరరావు, కోకన్వీనర్ పసుపులేటి చిన్నబాబు, ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిడూరి ఏలీయా, పలువురు నేతలు పాల్గొన్నారు.

వేగవరం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రెసిడెంట్‌గా అరవింద్

దెందులూరు : వేగవరంలోని హేలాపురి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీ నూతన వైస్ ప్రెసిడెంట్‌గా ఎ.అరవింద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, ఏఓ కరుణానిధి, కళాశాల హెచ్‌ఓడీలు, లెక్చరర్లు స్వాగతం పలికారు. అనంతరం కళాశాల సిబ్బందితో సమావేశం నిర్వహించి తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, మరుగుదొడ్లు, క్రీడాప్రాంగణం, వాహనాలను పరిశీలించారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో..



దెందులూరు : విశాఖలో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023కు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు కమిటీ సభ్యులు, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి హాజరయ్యారు.

ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం



అప్పనపేట రామాలయ ప్రతిష్ఠ యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం : గ్రామాలలో దేవాలయాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం అప్పనపేట గ్రామంలో కోదండ రామాలయం విగ్రహాల పునఃప్రతిష్ఠా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, యజ్ఞయాగాదులు నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, మాజీ మంత్రి రంగనాధరరాజు కుమారుడు నరేష్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దండు సూరిబాబు, సర్పంచ్ నక్కా సూరిబంగాచయ్య, ఎంపీటీసీ సత్యనారాయణ గ్రామస్తులు పాల్గొన్నారు.

మానవత భవన నిర్మాణానికి శంకుస్థాపన



మానవత సంస్థ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మానవత ప్రతినిధులు

పెదపాడు : అప్పనవీడు మానవత శాఖ నూతన భవన నిర్మాణానికి ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదుగా శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణానికి జన్యావుల సీతారామయ్య రంగమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు కొండలరావు, గాంధీ సుమారు రూ.35 లక్షల విలువైన రెండు సెంట్ల భూమిని విరాళంగా అందించారు. ఈ సందర్భంగా దాతలను మానవత సభ్యులు అభినందించారు.

నేడు గణపవరంలో గృహ సారథుల సమావేశం

గణపవరం : మండలంలోని గణపవరం, సరిపల్లె, కొత్తపల్లి, వరదరాజపురం, జల్లికొమ్మర, అర్ధవరం, అప్పనపేట, జల్లికాకినాడ గ్రామాలకు చెందిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీశ్రేణుల ఆత్మీయ సమావేశం శనివారం సాయంత్రం గం .4.30లకు నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము తెలిపారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని, పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తారని ఆయన తెలిపారు.

సీతారామస్వామి శాంతి కల్యాణోత్సవం



గుండుగొలనులో స్వామి, అమ్మవార్లకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

భీమడోలు : గుండుగొలనులో వేంచేసియున్న పురాతన దేవాలయం శ్రీసీతారామస్వామి వారి ఆలయంలో శుక్రవారం స్వామి, అమ్మవార్ల జన్మ నక్షత్రం పునర్వసును పురస్కరించుకుని శాంతి కల్యాణ మహోత్సవం కన్నుల వేడుకగా జరిగింది. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగరాజ్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వామి సాయి సుధీరాచార్యులు. యాజ్ఞిక స్వామి గోపాలాచార్యులు ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆలయంలోని ధ్రువ మూర్తులకు అభిషేకాలు, ఉత్సవ మూర్తులకు తలంబ్రాలు పోసి శాంతి కల్యాణం వేడుకగా నిర్వహించారు. కోవెల ప్రదక్షిణలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఆర్‌బీకేలో జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు



సూచనలు చేస్తున్న సైంటిస్టు కె.ఫణికుమార్ ఏడీఏ కె.లలితసుధ

పెదపాడు : రైతు భరోసా కేంద్రాల్లో జనుము, జీలగ, పిల్లిపెసర విత్తనాలు అందిస్తున్నామని, కావాల్సిన రైతులు ముందుగానే బుక్ చేసుకోవాలని ఏరువాక కేంద్రం డాట్ సెంటర్ సైంటిస్టు కె.ఫణికుమార్ తెలిపారు. స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయ సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రబీ పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఈ సందర్భంగా వరి, మినుము, పెసర పంటలో పలు సూచనలు, రకాలు ఎంపిక, విత్తుకునే సమయం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఏడీఏ కె.లలిత సుధ, వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్, ఏడీఏ వై.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

యర్రమిల్లిపాడులో చెరువుల ఆక్రమణల తొలగింపు

ఉంగుటూరు: యర్రమిల్లిపాడు గ్రామ ఆయకట్టులో ఉన్న కొత్త చెరవు, ఊరచెరువు, నల్లమాడు చెరువుల ఆక్రమణలను తొలగించే పక్రియ శుక్రవారం మొదలుపెట్టారు. పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసుల సాయంతో 8 ఎకరాల 28 సెంట్లులో ఉన్న 28 ఆక్రమణలను తొలగించారు. హైకోర్టు ఆదేశాలతో కలెక్టర్ ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఆక్రమణల తొలగింపులో తహసీల్దార్ వెంకటరమణ, ఈఓపీఆర్‌డీ షంషుద్దీన్, ఆర్‌ఐ సత్యనారాయణ, సాయిరమేష్ ఎస్సై స్వామి పాల్గొన్నారు.

శివ, కేశవుల వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభం



పెళ్లి కుమారునిగా శ్రీవేంకటేశ్వర స్వామి

భీమడోలు : భీమడోలులో ఒకే వేదికపై శివుని, శ్రీవేంకటేశ్వర స్వామివార్లకు ఏటా నిర్వహించే వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 7వ తేదీవరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని శ్రీపార్వతీ సమేత భీమేశ్వర స్వామి, శ్రీవేంకటేశ్వర ఆంజనేయ స్వామి వార్లకు ఆదివారం రాత్రి ఒకే వేదికపై కల్యాణాన్ని నిర్వహించేలా దేవస్థానం అధికారులు, ఉత్సవ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. ఈ సందర్భంగా రెండు దేవాలయాల్లో తొలి రోజును పురస్కరించుకుని ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయ పూజారులు ఉమాశంకర్, బృందావన పవన్ శాస్త్రోక్తరంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వార్లను పెళ్లి కుమారుడిగా ముస్తాబు చేశారు. ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్లాస్టిక్ వినియోగంతో మానవాళికి ముప్పు



పెదవేగిలో ప్లాస్టిక్ నిషేధంపై వివరిస్తున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్



గుండుగొలనులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెదవేగి : ప్లాస్టిక్ వినియోగం వల్ల మానవాళికి పెనుముప్పు అని ఎంపీడీవో జి రాజ్ మనోజ్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, వచ్చే వ్యాధులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు వాడరాదని, గుడ్డ సంచుల వినియోగం మేలని తెలిపారు. పాలిథిన్ కవర్లను డ్రెయినేజీల్లోనూ, కాలువల్లోనూ విసిరేయడం వలన పశుపక్ష్యాదులకు హానికరమన్నారు. టీ స్టాల్స్, హోటళ్ల వద్ద ప్లాస్టిక్ కప్పులలో టీ, కాఫీలు తాగడం వలన ప్లాస్టిక్ కరుగుతుందని, దీంతో కేన్సర్ సోకే ప్రమాదముందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచైనా ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని బహిష్కరించాలని, ఆ దిశగా కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పెదవేగి పంచాయతీ కార్యదర్శి కె.వరప్రసాద్, మహిళా పోలీస్ జ్యోతి పాల్గొన్నారు.

భీమడోలు : ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పలువురు వక్తలు అన్నారు. గుండుగొలను నెం.1 ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పాశం పాండురంగారావు ఆధ్వర్యంలో బాలబాలికలకు ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే అనర్థాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ప్లాస్టిక్ వస్తువులు వాడకు... పర్యావరణాన్ని పాడు చేయకు, ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేద్దాం.. భూగోళాన్ని కాపాడదాం, ప్లాస్టిక్ కవర్లకు వాడకు, ప్రాణాలు తీయకు, ప్లాస్టిక్ సంచు వద్దు.. గుడ్డ సంచే ముద్దు అంటూ నినాదాలు చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ కుమార్‌రాజా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.